ల్యాండ్‌పూలింగ్‌పై రైతుల ఆగ్రహం

- వరంగల్‌-హైదరాబాద్‌ జాతీయ రహదారి దిగ్బంధం
- ముందస్తు అరెస్టులతో ఉద్రిక్తత
- విపక్షాల మద్దతు-నేతల అరెస్ట్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

'కుడా' ల్యాండ్‌ పూలింగ్‌ నోటిఫికేషన్‌కు సంబంధించి జిఒ నెంబర్‌ 80ఎను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ రైతులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. వరంగల్‌-హైదరాబాద్‌ జాతీయ రహదారిపై కరుణపురం వద్ద రైతులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. రైతు ఐక్య కార్యాచరణ సమితి వరంగల్‌ జెఎసి జాతీయ రహదారిపై రాస్తారోకోకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ఉదయం నుంచే పలువురు రైతు సంఘాల నాయకులను, రైతులను పోలీసులు అరెస్టు చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ధర్మసాగర్‌, జఫర్‌గఢ్‌, ఐనవోలు మండలాల రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

జఫర్‌గఢ్‌ మండలంలోని రఘునాథపల్లిలో పోలీసులు రైతులను అదుపులోకి తీసుకునేందుకు యత్నించగా వాగ్వాదం జరిగింది. 'మాకున్న ఎకరం, రెండెకరాలు ల్యాండ్‌ పూలింగ్‌కు తీసుకుంటే మేం, మా పిల్లలు ఏం కావాలి?' అంటూ ప్రశ్నించారు. మా భూములు ఇవ్వబోమని తేల్చి చెప్పినా ప్రభుత్వం ఎందుకు జిఒ రద్దు చేయడం లేదు? అని నిలదీశారు. ఈ విషయంలో పోలీసులు తమకు సహకరించాలని రైతులు కోరారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేయడానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ఉదయమే ఐనవోలు మండలం పున్నేల్‌, వెంకటాపురం, జఫర్‌గఢ్‌ మండలం రఘునాథపల్లి గ్రామాల్లో రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. దీంతో పలు గ్రామాల్లో తోపులాటలు, వాగ్వివాదాలు జరిగాయి.

భారీగా పోలీసుల మోహరింపు

కరుణపురం వద్ద ల్యాండ్‌ పూలింగ్‌కు వ్యతిరేకంగా, జిఒ 80ఎను రద్దు చేయాలని రైతు ఐక్య కార్యాచరణ సమితి చేపట్టిన రాస్తారోకో నేపథ్యంలో పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. గ్రామాల నుంచి రైతులు పోలీసులను తప్పించుకుని పెద్దఎత్తున రాస్తారోకోలో పాల్గొన్నారు. ఆందోళనకు దిగిన రైతులు సిఎం కెసిఆర్‌ డౌన్‌ డౌన్‌, జై జవాన్‌.. జై కిసాన్‌ అంటూ నినాదాలు చేశారు. సిఎం కెసిఆర్‌ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.

విపక్షాల మద్దతు

రైతుల రాస్తారోకోకు పలు రాజకీయ పార్టీలు మద్దతు పలికాయి. ఎంపి సిరిసిల్ల రాజయ్య, దొమ్మాటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్‌, మాజీ మంత్రి గుండె విజయ రామారావు, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు, పద్మ తదితరులు రైతుల పోరాటానికి మద్దతు పలికి రాస్తారోకోలో పాల్గొన్నారు. అయితే, కాజీపేట ఎసిపి శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆందోళన చేస్తున్న నేతలు, రైతు జాక్‌ నేతలు, విపక్ష నేతలను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జిఒ నెంబర్‌ 80ఎను రద్దు చేయాలి
బొమ్మినేని రవీందర్‌రెడ్డి

రాస్తారోకోను భగ్నం చేయడానికి ప్రభుత్వం పోలీసులనుపయోగించి రైతులను అరెస్టు చేయించింది. వెంటనే రైతులందరినీ విడుదల చేయాలి. ల్యాండ్‌ పూలింగ్‌కు సంబంధించిన జీఓను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తం.

విద్యుత్‌ఘాతంతో గడ్డి ట్రాక్టర్‌ దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

విద్యుదాఘాతంతో గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ ట్రాలీ, గడ్డి దగ్ధమైన సంఘటన సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వంగపల్లి శివారు ఉప్పరోనిగడ్డలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పరోనిగడ్డకు చెందిన రైతు దొండకాయల బిక్షపతి తన ట్రాక్టర్‌లో దూల్మిట్ట మండలం కూటిగల్‌ గ్రామం నుంచి గడ్డిలోడుతో వస్తున్నాడు. ఉప్పరోనిగడ్డలో ట్రాక్టర్‌లోని గడ్డికి ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలు తగిలాయి. దాంతో గడ్డితో పాటు ట్రాక్టర్‌ ట్రాలీ పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.70 వేల నష్టం వాటిల్లినట్టు బాధితుడు దొండకాయల బిక్షపతి బోరున విలపించారు. ఆర్థికంగా నష్టపోయిన బాధితుడు బిక్షపతికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

మూడు రోజులపాటు మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్‌ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడొచ్చని సూచించారు. ఉత్తర ఇంటీరియల్‌ కర్నాటక నుంచి దక్షిణ తమిళ నాడు వరకు సముద్ర మట్టం నుంచి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉత్తర-దక్షిణ ద్రోణి విస్తరించి ఉందని తెలిపారు. రాబోయే 48 గంటల్లో నైరుతి, ఆగ్నేయా అరేబియా సముద్రంలోని పలు ప్రాంతాలు, మాల్దీవులు, కొమోరిన్‌ ప్రాంతం, దక్షిణ, తూర్పు బంగాళాఖాతం, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశముందని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో బుధవారం నిర్మల్‌ జిల్లా నర్సాపూర్‌ (జి)లో అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో బుధవారం 39 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్‌ నివేదికలో పేర్కొంది. కరీంనగర్‌ జిల్లా జమ్మికుంటలో అత్యధికంగా 1.8 సెంటీమీటర్ల వర్షం కురిసింది.

'జీరో టాలరెన్స్‌ ఆఫ్‌ కరప్షన్‌'ను అమలు చేయాలి : సిఎంకు ఎఫ్‌జిజి లేఖ

ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

ఢిల్లీ, పంజాబ్‌ రాష్ట్రాల్లో ఆప్‌ ప్రభుత్వాలు అవినీతిపై పోరాటంలో భాగంగా అమలు చేస్తోన్న జీరో టాలరెన్స్‌ ఆఫ్‌ కరప్షన్‌ పద్ధతిని తెలంగాణలోనూ అమలు చేయాలని కోరుతూ సిఎం కెసిఆర్‌కు ఫోరం ఫర్‌ గుడ్‌ గవర్నెన్‌ కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి బుధవారం లేఖ రాశారు. మన రాష్ట్రంలో ప్రభుత్వ పనులలో కమీషన్లు పెద్ద ఎత్తున చేతులు మారుతున్నాయనే చర్చ నడుస్తున్న నేపథ్యంలో దృష్టి సారించి ఉక్కుపాదం మోపాలని సూచించారు. అవినీతిని అరికట్టి ప్రజలకు సుపరిపాలన అందించాలని కోరారు. ప్రతిపక్షాలు కోరకున్నా, పత్రికల్లో వార్తలు రాకున్నా నిఘావర్గాల సమాచారం ఆధారంగా వైద్యశాఖ మంత్రిపై పంజాబ్‌ సిఎం చర్యలు తీసుకోవడం అభినందనీయమని ప్రశంసించారు. దేశరాజకీయాల్లో ఆప్‌ కొత్త అధ్యయనానికి తెరలేపిందని పేర్కొన్నారు. ఢిల్లీ, పంజాబ్‌ రాష్ట్రాల్లో ఆప్‌ ప్రభుత్వాల ఆధ్వర్యంలో సర్కారు బడులు, బస్తీ దవాఖానాల నిర్వహణ బాగుందనీ, వాటిని తెలంగాణలోనూ అమలు చేస్తామని కేసీఆర్‌ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలోనే జీరో టాలరెన్స్‌ ఆఫ్‌ కరప్షన్‌ పద్ధతిని అమలు చేయాలని కోరారు.

భీంగల్‌లో వంద పడకల ఆస్పత్రి

పరిపాలనా అనుమతులు మంజూరు

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

నిజామాబాద్‌ జిల్లా భీంగల్‌ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆస్పత్రిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్‌.ఎ.ఎం.రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రూ.35 కోట్లను ఆస్పత్రి నిర్మాణానికి, రూ.9.84 కోట్లను నిర్వహణ ఖర్చుగా వెచ్చించనున్నారు. పిహెచ్‌సిని ఏరియా ఆస్పత్రిగా ఉన్నతీకరిస్తున్న నేపథ్యంలో దాన్ని రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల పరిధి నుంచి తెలంగాణ వైద్య విధాన పరిషత్‌కు బదిలీ చేశారు.

ధన్యవాదాలు : మంత్రి వేముల ప్రశాంత్‌ రెడ్డి

భీంగల్‌కు వంద పడకల ఆస్పత్రికి మంజూరు చేయించిన సిఎం కెసిఆర్‌కు, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌ రావుకు రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఇక మీదట ప్రయివేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరముండదని పేర్కొన్నారు. బాల్కొండ ప్రజలపై సీఎం చూపే ప్రేమకు ఆస్పత్రి నిదర్శనమని వివరించారు.

హైదరాబాద్‌కు మోడీ...బెంగళూరుకు కెసిఆర్‌

- నేడు ఐఎస్‌బి ద్విదశాబ్ది వార్షికోత్సవానికి ప్రధాని
- మాజీ ప్రధాని దేవగౌడతో సిఎం సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

ప్రధాని నరేంద్ర మోడీ గురువారం మధ్యాహ్నం హైదరాబాద్‌ వస్తున్నారు. అంతకుముందే సిఎం కెసిఆర్‌ ప్రత్యేక విమానంలో బెంగుళూరు వెళ్లనున్నారు. గత కొంతకాలంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, ప్రధాని మోడీపై తీవ్ర విమర్శలు చేస్తున్న కెసిఆర్‌..మోడీ హైదరాబాద్‌ వచ్చే సందర్భంలోనే బెంగళూరు పర్యటన ఖరారు చేసుకోవడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమయింది. ఇటీవల మోడీ హైదరాబాద్‌ వచ్చిన రెండు సందర్భాల్లో కూడా కెసిఆర్‌ దూరంగానే ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మోడీకి సిఎస్‌ స్వాగతం పలకనున్నారు. అయితే, విమానాశ్రయంలో మోడీకి ఘనంగా స్వాగతం పలికేందుకు రాష్ట్ర బిజెపి నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ బిజెపి కార్యకర్తలు, నాయకులతో మోడీ మాట్లాడేఅవకాశం ఉంది.

దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ (ఐఎస్‌బి) ద్విదశాబ్ది వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ హాజరవుతున్నారు. ఐఎస్‌బి హైదరాబాద్‌కు చెందిన 600 మంది, మొహాలికి చెందిన 330 మంది కలిపి మొత్తం 930 మంది విద్యార్థులతో ఈ వేడుకలు జరగనున్నాయి. ఎనిమిది మంది విద్యార్థులకు ప్రధాని మోడీ బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. విద్యార్థులనుద్దేశించి కీలకోపన్యాసం చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ హాజరవుతారని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌ తెలిపారు.

భారీ భద్రత

ప్రధాని నరేంద్ర మోడీ హైదరాబాద్‌కు వస్తున్న సందర్భంగా పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. రెండు వేల మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐఎస్‌బి విద్యార్థులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. డ్రోన్‌ కెమెరాలకు అనుమతిని నిరాకరించారు. సైబరాబాద్‌ సిపి స్టీఫెన్‌ రవీంద్ర సెలవులో ఉన్నందున హైదరాబాద్‌ సిపి సివి ఆనంద్‌కు ప్రధాని పర్యటనకు సంబంధించిన ఇన్‌ఛార్జి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

ప్రధాని మోడీ సమాధానం చెప్పాలి

టిఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

రాష్ట్రానికి చుట్టపుచూపుగా వచ్చి ఉపన్యాసాలకు పరిమితమై పోతున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలని టిఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే వివేకానంద డిమాండ్‌ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని రాష్ట్ర పర్యటనతో ప్రజలకు పైసా ప్రయోజనం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అడుగుతున్న ఒక్క ప్రశ్నకు సమాధానం చెప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌ఎంటి ఆస్తులను, సంస్థలను కాపాడాలని కేంద్రాన్ని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆస్తులను కేంద్రం లాక్కోవడం సరికాదని తెలిపారు. కార్మికుల పక్షాన టిఆర్‌ఎస్‌ పోరాడుతుందని స్పష్టం చేశారు. కేంద్ర పరిధిలో ఉద్యోగ నియామకాలపై మోడీ పెదవి విప్పాలని కోరారు. కేంద్రంలోని బిజెపి సర్కారు రాష్ట్రంపై ప్రదర్శిస్తున్న వివక్షకు వ్యతిరేకంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పోరాడాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ డిమాండ్‌ చేశారు. సికింద్రాబాద్‌ ఎంపీగా కిషన్‌రెడ్డి ప్రజలకే కాదు బిజెపి కార్యకర్తలకు చేసిందీ ఏమి లేదన్నారు.

పోలీసు ఉద్యోగాలకు 12 లక్షల దరఖాస్తులు

నేటితో ముగియనున్న గడువు

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

పోలీసు ఉద్యోగాలకు అన్ని విభాగాల్లో కలిపి బుధవారం వరకు 12 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గురువారంతో గడువు ముగియనున్న నేపథ్యంలో మరో 10 వేల వరకు దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 17,516 పోస్టులకు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్‌ నియామక మండలి నోటిఫికేషన్‌ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దరఖాస్తు గడువు ఈ నెల 20న రాత్రి 10 గంటల వరకు తుది గడువుగా టిఎస్‌ఎల్‌పిఆర్‌బి ప్రకటించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు యూనిఫాం సర్వీసెస్‌ ఉద్యోగాలకు ప్రభుత్వం మరో రెండేళ్లు వయోపరిమితి పెంచింది. ఈ నేపథ్యంలో దరఖాస్తుల సమర్పణకు 26వ తేదీ వరకు గడువును పొడిగించారు.

తెలంగాణ మసీదులను తవ్వడానికి సిద్ధమా

బండి సంజయ్‌ వివాదాస్పద వ్యాఖ్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

దేశంలో ఏ మసీదును తవ్వినా శివలింగాలు బయటపడుతున్నాయి.. తెలంగాణలో కూడా మసీదులు తవ్వడానికి సిద్ధమా..? అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ మజ్లిస్‌ నేత, ఎంపి అసదుద్దీన్‌ ఒవైసికి సవాల్‌ విసిరారు. హనుమాన్‌ జయంతి సందర్భంగా బుధవారం కరీంనగర్‌ పట్టణంలో నిర్వహించిన హిందూ ఏక్తా యాత్రలో పాల్గొన్న బండి సంజయ్‌ మతవిద్వేష.. వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

భైంసా తహసీల్దార్‌ అక్రమాస్తులు కోటి పైనే..!

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

అవినీతి అక్రమాలకు పాల్పడిన నిర్మల్‌ జిల్లా భైంసా మండల తహసీల్దార్‌ నరేందర్‌ కోటి రూపాయల పైనే అక్రమాస్తులు సంపాదించినట్టు ఎసిబి విచారణలో వెలుగు చూసింది. అంజనీ కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. నరేందర్‌ అవినీతి, అక్రమాలకు పాల్పడి భారీ మొత్తంలో అక్రమాస్థులను కూడగట్టినట్టు ఎసిబికి సమాచారమందింది. దీంతో ఎసిబి అధికారులు అతని ఆస్థులపై ఏక కాలంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ. 1,16,00, 314 విలువైన అక్రమాస్థులను నరేందర్‌ కలిగి ఉన్నట్టు బయటపడింది. అంతేగాక, అంతని ఇంటి నుంచి రూ.1.34 లక్షల నగదును కూడా ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో ఇతను తహసీల్దార్‌గా పని చేసిన ఏరియాల్లో సైతం అవినీతికి పాల్పడినట్టు ఎసిబికి సమాచారముంది. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతుందని అంజనీ కుమార్‌ తెలిపారు.

'గీతమ్‌'ను సందర్శించిన యుకె బృందం

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

యునైటెడ్‌ కింగ్‌డమ్‌ నాటింగ్‌హామ్‌ విశ్వవిద్యాలయం విద్యావేత్తలతో కూడిన ప్రతినిధి బృందం బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని గీతం డీమ్డ్‌ విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని సందర్శించింది. నాటింగ్‌హామ్‌ విశ్వవిద్యాలయం, గీతం మధ్య భవిష్యత్‌లో విద్యాపరమైన సహకారంపై ఆ ప్రతినిధి బృందం చర్చించినట్టు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్‌ పి.త్రినాథరావు వెల్లడించారు. బ్రిటన్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనే అభిలాష ఉన్న విద్యార్థులతో వారు ముఖాముఖి చర్చించడంతో పాటు ఆ విశ్వవిద్యాలయం అందజేస్తున్న ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌ల గురించి వివరించినట్టు తెలిపారు. ఈ ప్రతినిధి బృందంలో జార్జ్‌ గ్రీన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఫర్‌ ఎలక్ట్రోమాగ్నెటిక్స్‌ రీసెర్చ్‌ సభ్యుడు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ స్టీవ్‌ గ్రీవ్‌, బయోటెక్నాలజీ ప్రోగ్రామ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నాగమణి బోరా, స్టూడెంట్‌ ఎక్స్‌పీరియన్స్‌ మేనేజర్‌ (అడ్మిషన్స్‌) లూసీ రోజ్‌, ఇంటర్నేషనల్‌ పార్టనర్‌షిప్‌ మేనేజర్‌ మ్యాట్‌ బోన్నర్లు ఉన్నారని వివరించారు. గీతం కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ వేణుకుమార్‌ నాతి నేతృత్వంలోని గీతం అధ్యాపక బృందం వారితో చర్చించినట్టు తెలిపారు.

దాసరి తెలుగు సినీ రంగ వెలుగు

ప్రజాశక్తి - కల్చరల్‌

దాసరి నారాయణరావు తెలుగు సినీ రంగ ప్రపంచ వెలుగు అని తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ ఛైర్మన్‌ జస్టిస్‌ చంద్రయ్య అన్నారు. రవీంద్రభారతిలోని ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ ప్రగ్నిక ఫౌండేషన్‌, ప్రగ్నిక ఆర్ట్స్‌ అకాడమీ నిర్వహణలో సెల్వెల్‌ కార్పొరేషన్‌ సౌజన్యంతో విఖ్యాత దర్శకుడు దాసరి నారాయణరావు జయంతి సంగీత భరితంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జస్టిస్‌ చంద్రయ్య పాల్గొని దాసరి పేరిట పురస్కారాన్ని నటి శివ పార్వతికి బహూకరించి మాట్లాడారు. దర్శకునిగా, కథా రచయితగా, నిర్మాతగా దాసరి ఎన్నో హిట్‌ చిత్రాలను అందించారన్నారు. ఆయన ప్రతి చిత్రం ఎదో సందేశంతో ఉంటుందని నేటి యువ దర్శకుల దాసరిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. శివ పార్వతి మాట్లాడుతూ, దాసరి మానవతా వాది.. సినీ కార్మికుల పక్షన నిలబడిన నాయకుడని కొనియాడారు. వేదికపై పురుషోత్తం, రఫీ, మోహన్‌, అంజయ్య, బండయ్యే గౌడ్‌ తదితరులు పాల్గొనగా ప్రవీణ్‌ స్వాగతం పలికారు. కార్యక్రమానికి తొలుత సుజాత, ఇందు నయన ,శ్రీనివాసన్‌,సింహ,లక్ష్మణ్‌ తదితరులు ప్రవీణ్‌తో పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.

హరనాధరావు రచనలు సామాజిక వాస్తవాలు

నవల రచయిత యండమూరి

ప్రజాశక్తి - కల్చరల్‌

హరనాధరావు నాటకాలు, కథలు సామాజిక ప్రయోజన లక్ష్యంగా ఉంటాయని ప్రముఖ నవల రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌ కొనియాడారు. బుధవారం తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టిఆర్‌ కళా మందిరంలో అభినయ (ఒంగోలు) నిర్వహణలో ఎమ్‌.వి.యెస్‌. హరనాధరావు రచించిన నాటక సంకలనాన్ని వీరేంద్రనాథ్‌ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. హరనాధరావు నాటక, సినీ సంభాషణలు సూటిగా అర్ధవంతంగా ఉంటాయన్నారు. ప్రభుత్వ సలహాదారు డాక్టర్‌ కెవి రమణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. హరనాధరావు నటునిగా నాటక దర్శకునిగా కూడా పేరు గడించారని అభినందించారు. తొలి ప్రతిని శాంత బయోటెక్‌ అధినేత డాక్టర్‌ వరప్రసాద్‌ రెడ్డికి రచయిత బహూకరించారు. వేదికపై ఆంధ్ర నాటక కళా పరిషత్‌ చైర్మన్‌ బొల్లినేని కృష్ణయ్య, దర్శకుడు ముత్యాల సుబ్బయ్య, నటుడు సంజీవి, తదితరులు పాల్గొని సభకు సంస్థ అధ్యక్షుడు అన్న మానేని ప్రసాదరావు స్వాగతం పలికారు.

అధికార యావతో మతాల మధ్య చిచ్చు

బండి సంజయ్‌ వ్యాఖ్యలపై తమ్మినేని ఖండన

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

తెలంగాణలో ఎలాగైనాసరే అధికారంలోకి రావాలనే యావతో ఇక్కడ మతాల మధ్య చిచ్చు పెట్టేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తం చేశారు. తాజాగా ఆ పార్టీ అధ్యక్షుడు బండి సంజయ్‌ ఇదే కోవలో కరీంనగర్‌లో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఇలాంటి వ్యాఖ్యలు, చర్యలను తీవ్రంగా ఖండించాలని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'హిందూ ఏకతా యాత్ర.. దాని హెడ్డింగే తప్పు. సమస్యలపై ప్రజల్ని ఏకం చేయాలి, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రజల్ని ఏకం చేయాలి, అభివృద్ధి కోసం ప్రజల్ని ఏకం చేయాలి... అంతే తప్ప మతం కోసం ఏకం చేయటమనేది మత గురువులు చేసుకుంటారు, కానీ ఒక రాజకీయ నాయకుడిగా బండి సంజయ్‌ అలాంటి యాత్రలు చేయటం తప్పు. రెండోది దానికొక సాధ్వీపరిషత్‌ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి స్వామీజీని పిలిచారు. ఆ పరిషత్‌ ఏంటో, అది ఎందుకు ఉందో..? ఏ మఠమో తెలియదు. ఆయన డైరెక్టుగా బండి సంజయ్‌ అధికారంలోకి వస్తే దేవాలయాలు బాగుపడతాయి.. మతం బాగుపడుతుంది.. మొత్తం దేశం బాగుపడుతుందంటూ చెప్పారు. ఇదంతా ఒక కిరాయి గుంపులాగా కనబడుతుంది తప్ప కనీసం హిందూమత ప్రాతిపదిక కూడా దానికి కనబడటం లేదు. హిందూ మతాన్ని వాడుకుంటున్నారు తప్ప వేరేదేమీ కాదు. హిందూ మతస్తులు ఈ తతంగాన్ని చూసి అసహ్యించుకోవాలి తప్ప అదేదో హిందూ మతం కోసం వచ్చిన యాత్ర అనుకుంటే పొరపాటు. మరోవైపు వీళ్ల చట్ట విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. మసీదులన్నీ తవ్వాలి, వాటిలో శవాలు బయటపడితే మీవి, శివలింగాలు బయటపడితే మావంటూ మాట్లాడటం చట్ట విరుద్ధం. శివలింగాలు ఎందుకు బయటపడుతున్నాయో, దాంట్లోని తత్వమేమిటో అందరికీ తెలుసు. అందువల్ల ఇలాంటి వివాదాలను రెచ్చగొట్టటం, మత ఘర్షణలు లేపటం ద్వారా బిజెపి బలపడేందుకు ప్రయత్నిస్తున్నది. దేశవ్యాప్తంగా ఆ పార్టీ పెరిగిన తీరు అదే. తెలంగాణలో కూడా ఆ పద్ధతుల్లోనే అది ప్రయత్నిస్తున్నది. ఈ కుట్రను ప్రజలు అర్థం చేసుకోవాలి. ఇది చట్ట విరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం. 1991లో బాబ్రీ మసీదు విధ్వంసం తర్వాత పార్లమెంటు ఒక చట్టం చేసింది. 1947 ఆగస్టు 15 నాటికి ఉన్న పొజిషన్‌ను యధాతథంగా ఉంచాలి.. గుళ్లు, మసీదులు, ఇంకేదైనా ప్రార్థనా స్థలాలను విధ్వంసం చేయటం, మత విద్వేషాలను రెచ్చగొట్టటమనేది రాజ్యాంగ విరుద్ధమంటూ చట్టం చేశారు. ఇప్పుడు ఆ చట్టాన్ని తిరగదోడి అన్నింటినీ తవ్వాలని చెప్పటమనేది అత్యంత ఆందోళనకరం, ప్రమాదకరం. సాయుధ పోరాట కాలం నుంచి ఒక సెక్యులర్‌ విలువలతో, హిందూ ముస్లిములు అందరూ ఏకమై, రాచరిక పరిపాలనకు వ్యతిరేకంగా పోరాడి పునీతమైన గడ్డ తెలంగాణ. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరూ కలిసి కట్టుగా జరిపిన పోరాటమది. దాన్ని కూడా హిందూ, ముస్లిం మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించిన పార్టీ బిజెపి. ఎలాగైనా తెలంగాణలో అధికారంలోకి రావాలనే యావతో ఇదంతా చేస్తున్నారు. ఇందుకోసం మతాల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఇలాంటి చర్యలను, కుట్రలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. మొత్తం తెలంగాణ సమాజం కోసం కూడా దీన్ని ఖండించాలనీ, ఇలాంటి చర్యలను సాగనివ్వకూడదని విజ్ఞప్తి చేస్తున్నాం....' అని తమ్మినేని పేర్కొన్నారు.

MIC Electronics Limited
Regd. Off: Plot No. 192/B, Phase-II, IDA, Cherlapally, Rangareddi, Hyderabad, Telangana - 500051.

మార్చి 31, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి ఆడిట్‌ చేయబడిన
కన్సాలిడేటెడ్‌ ఫైనాన్షియల్‌ ఫలితాల సంగ్రహం.
(రూ. కోట్లలో)

క్ర. సం	వివరాలు	క్వార్టర్‌ ముగిసినది			సంవత్సరం ముగిసినది	
		31-03-2022 ఆడిట్‌చేసినది	31-12-2021 ఆడిట్‌చేయనిది	31-03-2021 ఆడిట్‌చేసినది	31-03-2022 ఆడిట్‌చేసినది	31-03-2021 ఆడిట్‌చేసినది
1	కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం	15.26	27.27	2.36	46.25	4.23
2	కాలానికి నికర లాభం/(నష్టం) (పన్ను, అసాధారణ అంశాలు)	(0.91)	7.14	2.31	3.03	(5.41)
3	పన్నుకు ముందు కాలానికి నికర లాభం/(నష్టం) (అసాధారణమైన అంశాల తర్వాత)	(0.91)	7.14	2.31	3.03	(5.41)
4	పన్ను తర్వాత నికర లాభం/(నష్టం) (అసాధారణమైన అంశాల తర్వాత)	(0.98)	7.14	2.31	2.89	(5.41)
5	కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం (ఆ కాలానికి లాభం/(నష్టం) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత)	(0.98)	7.14	2.31	2.89	(5.41)
6	ఈక్విటీ షేర్‌ క్యాపిటల్‌ (ముఖ విలువ. 2/- ఒక్కో షేరు)	44.29	11.01	44.05	44.29	44.05
7	ఇతర ఈక్విటీ (ఆడిట్‌ చేయబడిన బ్యాలెన్స్‌ షీట్‌లో చూపిన రీవాల్యుయేషన్‌ రిజర్వ్‌ మినహా)	-	-	-	18.48	(39.04)
8	ప్రతి షేరుకు ఆదాయాలు 2/- ఒక్కొక్కటి (కొనసాగించే మరియు నిలిపివేసే కార్యకలాపాల నుండి)					
	బేసిక్‌ (రూ.లో)	(0.04)	1.30	0.10	0.13	(0.25)
	డైల్యూటెడ్‌ (రూ.లో)	(0.04)	1.30	0.10	0.13	(0.25)

ఎమ్‌ఐసి ఎలక్ట్రానిక్స్‌ లిమిటెడ్‌ యొక్క స్వతంత్ర ఆర్థిక ఫలితాలకు సంబంధించిన కీలక డేటా క్రింది విధంగా ఉంది

క్ర. సం:	వివరాలు	క్వార్టర్‌ ముగిసినది			సంవత్సరం ముగిసినది	
		31-03-2022	31-12-2021	31-03-2021	31-03-2022	31-03-2021
1	కార్యకలాపాల నుండి మొత్తం ఆదాయం	1.34	27.27	2.36	32.33	4.23
2	పన్నుకు ముందు లాభం	(1.13)	7.14	2.31	2.81	(5.41)
3	పన్ను ఖర్చులు	-	-	-	-	-
4	పన్ను తర్వాత నికర లాభం	(1.13)	7.14	2.31	2.81	(5.41)
5	కాలానికి మొత్తం సమగ్ర ఆదాయం (ఆ కాలానికి లాభం/(నష్టం) (పన్ను తర్వాత) మరియు ఇతర సమగ్ర ఆదాయం (పన్ను తర్వాత)	(1.13)	7.14	2.31	2.81	(5.41)

నోట్‌: పైన పేర్కొన్నది మార్చి 31, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరం యొక్క వివరణాత్మక ఫార్మాట్‌ యొక్క సారం, ఆర్థిక ఫలితాలు ఆడిట్‌ కమిటీచే సమీక్షించబడ్డాయి మరియు మే 25, 2022న వారి సంబంధిత మీటింగ్‌ షెడ్లో డైరెక్టర్ల బోర్డుచే ఆమోదించబడ్డాయి మరియు అదే స్టాక్‌ ఎక్సేంజ్‌లలో దాఖలు చేయబడింది అంటే, సెబి (లిస్టింగ్‌ ఆబ్లిగేషన్స్‌ అండ్‌ డిస్‌క్లోజర్‌ రిక్వైర్‌మెంట్స్‌) రెగ్యులేషన్స్‌, 2015 యొక్క రెగ్యులేషన్‌ 33 ప్రకారం బిఎస్‌ఇ మరియు ఎన్‌ఎస్‌ఇ. మార్చి 31, 2022తో ముగిసిన త్రైమాసికం మరియు సంవత్సరానికి సంబంధించిన పూర్తి ఫార్మాట్‌ ఆర్థిక ఫలితాలు స్టాక్‌ ఎక్సేంజ్‌ల వెబ్‌సైట్‌ www.bseindia.com, www.nseindia.com లో మరియు కంపెనీ వెబ్‌సైట్‌ www.mic.co.in లో కూడా అందుబాటులో ఉన్నాయి.

బోర్డు ఆర్డర్‌ ప్రకారం
For MIC Electronics Limited
సం/- శ్రీ కౌషిక్‌ యలమంచిలి
మేనేజింగ్‌ డైరెక్టర్‌
DIN: 07334243

ప్రదేశం : హైదరాబాద్‌,
తేది: 25.05.2022

epaper.prajasakti.com